
RAKSHANA_praja jyothi Medhak.qxd 2/17/2026 12:12 AM Page 1


# రక్షణ
## ఉమ్మడి గుంటూరు

మంగళవారం 17 ఫిబ్రవరి 2026 పేజీలు : 4


## అంబటి భవితవ్యం 18న తేలనుందా?



వివరాలు 2లో..

సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీడ్రా కేసులో మాజీ మంత్రి అంబటి రాంబాబు బెయిల్ పొందుతారా? లేక పోలీస్ కస్టడీకి వెళ్లాల్సి వస్తుందా? అన్నది రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# విజన్‌కు గేట్స్ ముద్ర



**అమరావతిలో సీఎం చంద్రబాబు--బిల్ గేట్స్ చారిత్రక భేటీ.. టెక్ పాలన, ఆరోగ్యం, అగ్రి--ఏఐపై గేట్స్ ప్రశంసలు...**

**రైతులతో ముఖాముఖి... డ్రోన్లు, ఏఐతో సాగు పరిశీలన,, గేట్స్ ఫౌండేషన్--ఏపీ భాగస్వామ్యంతో స్వర్ణాంధ్రకు వేగం**

గుంటూరు జిల్లా కేంద్రంగా ఉన్న అమరావతి వేదికగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో జరిగిన భేటీ, టెక్నాలజీ ఆధారిత పాలన, ఆరోగ్యం--వ్యవసాయం రంగాల్లో ఏఐ వినియోగం గేట్స్‌ను ఆకట్టుకున్నాయి. 'నైస్, గుడ్, గ్రేట్' అంటూ ఏపీ మోడల్‌ను ప్రశంసించిన గేట్స్ వ్యాఖ్యలు గుంటూరు జిల్లా సహా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.



గుంటూరు జిల్లా పరిధిలోని అమరావతిలో బిల్ గేట్స్ పర్యటన ఆంధ్రప్రదేశ్ పాలనకు, అభివృద్ధి దిశకు ఒక మైలురాయిగా నిలిచింది.
సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లతో సమావేశమైన గేట్స్... రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న టెక్నాలజీ ఆధారిత గవర్నెన్స్ విధానాలను లోతుగా పరిశీలించారు. ముఖ్యంగా రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజీఎస్)లో డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానం చేయడం, అవేర్ 2.0తో రియల్ టైమ్ సమాచారం సేకరణ, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వందలాది పౌర సేవలను ప్రజల చేతుల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలను గేట్స్ మిగతా 2లో

గుంటూరు రక్షణ బ్యూరో

### తిరునాళ్లలో ...
# మద్యం మాఫియా...



- చట్టాన్ని కాలరాస్తున్న పోలీసే!
- నిషేధాన్ని ధిక్కరించి బహిరంగ మద్యం అమ్మకాలు

నరసరావుపేట పరిధిలోని కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా మద్యం అమ్మకాలపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ, అదే చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు విభాగానికి చెందిన హోమ్ గార్డ్ బహిరంగంగా మద్యం విక్రయాలకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. తిరునాళ్ల విధులను గాలికి వదిలేసి మద్యం వ్యాపారంలో నిమగ్నమైన ఈ ఘటన ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలించింది.

పల్నాడు జిల్లా వ్యాప్తంగా కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా మద్యం అమ్మకాలు, రవాణాపై కఠిన నిషేధం విధించారు. ఈ క్రమంలో మూడు రోజుల పాటు కోటప్పకొండ పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, ప్రస్తుతం నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 'కోటి' అనే హోమ్ గార్డ్ బహిరంగంగా మద్యం అమ్మకాలకు మిగతా 2లో

రక్షణ న్యూస్ క్రైమ్

# నేటి నుంచి అగ్నివీర్ రిక్రూట్మెంట్

- గుంటూరులో అర్ధరాత్రి నుంచే ఎంపిక ప్రక్రియ
- ఏపీ తెలంగాణ రాష్ట్రాల పురుష అభ్యర్థులకు అవకాశం



వివరాలు 2లో..

ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ నేటి నుంచి గుంటూరులో ప్రారంభం కానుంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అర్ధరాత్రి 12 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ చేపట్టనుండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది అభ్యర్థులు పాల్గొననున్నారు.

# విజన్‌కు గేట్స్ ముద్ర

మొదటి పేజీ తరువాయి

ప్రశంసించారు.పాలనలో వేగం,పారదర్శకత, బాధ్యతను టెక్నాలజీతో కలిపిన విధానం ప్రపంచానికి ఆదర్శంగా నిలవగలదని గేట్స్ అభిప్రాయపడ్డారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు బ్లాక్‌చెయిన్, క్యూఆర్ కోడ్‌ల వినియోగం, ప్రభుత్వ డాక్యుమెంట్లకు ఏఐ సెర్చ్ సౌకర్యం వంటి చర్యలు ప్రజలకు నమ్మకాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ అమలుతో పన్నుల వసూళ్లు పెరిగిన తీరు, కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా జీఎస్డీపీ వృద్ధిని ఎప్పటికప్పుడు అంచనా వేయడం కూడా ఆయనను ఆకట్టుకుంది.ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో అమలవుతున్న 'సంజీవని' డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టును గేట్స్ 'వెరీ నైస్'గా అభివర్ణించారు. తక్కువ ఖర్చుతో ముందస్తు వైద్య పరీక్షలు, ఏఐ ఆధారిత ప్రాథమిక వైద్య సలహాలు పేదల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికలు గేట్స్‌ను మరింత సంతృప్తిపరిచాయి.గుంటూరు జిల్లా సమీపంలోని ఉండవల్లి వ్యవసాయ క్షేత్రంలో రైతులతో ముఖాముఖి అయిన గేట్స్... అగ్రి--ఏఐ మోడల్‌ను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏఐ యాప్‌లతో పంటలకు వచ్చిన తెగుళ్ల గుర్తింపు, డ్రోన్ స్ప్రే ద్వారా ఖచ్చితమైన మందుల పిచికారీ, సాగు ఖర్చు తగ్గింపు వంటి విధానాలను చూసి "అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఇంత సమగ్రంగా వినియోగించడం లేదు" అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కొనియాడారు. మహిళా రైతులు స్వయంగా వండిన స్థానిక వంటకాలను గేట్స్ ఆసక్తిగా రుచి చూడడం ఈ పర్యటనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.స్వర్ణాంధ్ర--2047 విజన్‌పై జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను వివరించారు. డేటా--ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, క్వాంటం వ్యాలీగా అమరావతి, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు వంటి థీమాటిక్ క్లస్టర్లు ఏపీని ఫ్యూచర్ స్టేట్‌గా తీర్చిదిద్దనున్నాయని చెప్పారు. దీనిపై స్పందించిన గేట్స్... చంద్రబాబు విజనరీ నాయకుడని, తొలి భేటీలోనే ఆయన ముందుచూపు తనకు అర్థమైందని వ్యాఖ్యానించారు.మొత్తంగా గుంటూరు జిల్లా కేంద్రంగా జరిగిన ఈ పర్యటన... ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మోడల్‌కు గ్లోబల్ ముద్ర వేసిన ఘట్టంగా నిలిచింది. టెక్నాలజీ ఆధారిత పాలన, ప్రజా సేవల్లో నాణ్యత, రైతు--ఆరోగ్య రంగాల్లో ఇన్నోవేషన్‌తో ఏపీ దేశానికే కాకుండా ప్రపంచానికీ మార్గదర్శకంగా మారుతున్నదన్న సందేశాన్ని ఈ పర్యటన బలంగా చాటింది.

# అంబటి భవితవ్యం 18న తేలనుందా?

మొదటి పేజీ తరువాయి

గుంటూరు రక్షణ న్యూస్

2023లో సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించిన కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు కీలక దశను ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు విచారణ జరిపింది.అంబటి తరపు న్యాయవాది, తీవ్ర నేరాలు, జీవిత ఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని చట్టం చెబుతోందని వాదించారు. ఈ కేసులో అలాంటి సెక్షన్లు లేవని, కాబట్టి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మరోవైపు పోలీసుల న్యాయవాది, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారన్న ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరపాల్సి ఉందని, అందుకే కస్టడీ అవసరమని తెలిపారు.ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై తీర్పును ఈ నెల 18వ తేదీకి రిజర్వ్ చేశారు. కోర్టు తీర్పు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

# నేటి నుంచి అగ్నివీర్ రిక్రూట్మెంట్

మొదటి పేజీ తరువాయి

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ప్రారంభం కానుంది. ఈ ర్యాలీ ఫిబ్రవరి 27వ తేదీ వరకు కొనసాగనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పురుష అభ్యర్థులకు ఈ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ రజత్ సువర్ణ తెలిపారు.ర్యాలీ నిర్వహణకు నాగార్జున విశ్వవిద్యాలయంలోని 400 మీటర్ల సింథటిక్ ట్రాక్‌ను సిద్ధం చేయగా, రాత్రి సమయంలో పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. శారీరక కొలతలు, వైద్య పరీక్షల కోసం ఇండోర్ బాడ్మింటన్ హాల్, జిమ్ భవనాలను వినియోగిస్తున్నారు. ట్రాక్‌కు ఆనుకుని పరుగు పరీక్షలు, డ్రగ్ టెస్టులు, అభ్యర్థుల హాజరు నమోదు, వేచి ఉండే ప్రదేశం, మొబైల్ టాయిలెట్స్ వంటి ఏర్పాట్లు చేశారు.అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలు, అంబులెన్సులు, హృద్రోగ నిపుణులు, ఎముకల వైద్యులను సిద్ధంగా ఉంచారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది, అగ్నిమాపక శకటాలు, పోలీస్ బందోబస్తు, అవసరమైన చోట బారికేడింగ్ ఏర్పాటు చేశారు.మొత్తం 8,598 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా ఈ ర్యాలీలో పాల్గొంటున్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లరికల్/స్టోర్ కీపర్, ట్రేడ్స్‌మన్ విభాగాల్లో 8వ, 10వ తరగతి అర్హతలతో ఎంపికలు జరుగుతాయి. మొదటి దశలో 1.60 కిలోమీటర్ల పరుగు, అనంతరం శారీరక, వైద్య, డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తారు. తుది ఎంపికైన అభ్యర్థులకు రెండు--మూడు నెలల తర్వాత నియామక ఉత్తర్వులు ఇ-మెయిల్ ద్వారా పంపిస్తామని అధికారులు తెలిపారు.జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆర్మీ అధికారులతో కలిసి సోమవారం అర్ధరాత్రి లాంఛనంగా ర్యాలీని ప్రారంభించనున్నారు.

# గాంధీ పార్క్ అభివృధి పై కమిషనర్ ఫోకస్

## గాంధీ పార్క్ అభివృద్ధి పై కమిషనర్ సీరియస్ బిసమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం...

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని గాంధీ పార్క్‌ను అన్ని రకాల వసతులతో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. పార్క్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం టికెట్ల విక్రయాల ద్వారా లభిస్తున్న ఆదాయం, ఇతర సంబంధిత అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.సోమవారం ఆయన గాంధీ పార్క్ మరియు ట్రావెలర్స్ బంగ్లాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పార్క్ విస్తీర్ణం, వాకింగ్ ట్రాక్, డైనోసార్ స్ట్రక్చర్, స్కేటింగ్ రింగ్, సాఫ్ట్ గేమ్స్ జోన్, వాటర్ గేమ్ జోన్, ఓపెన్ జిమ్, చెస్ బోర్డ్ వంటి వసతుల ప్రస్తుత స్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ సంతృప్తికరంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్క్‌లో ఇప్పటికే ఉన్న సదుపాయాలను తక్షణమే ఫంక్షనింగ్‌లోకి తీసుకురావాలని, కొత్త అభివృద్ధి పనులపై ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రీనరీ పెంపుపై ఉద్యానవన విభాగం ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించుకోవాలని సూచించారు.



నగరంలోని డివైడర్లపై ఉన్న మొక్కలకు ప్రస్తుత వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అదనపు ట్రిప్‌ల ద్వారా నీటి సరఫరా చేయాలని తెలిపారు. పార్క్‌ల వారీగా పనిచేస్తున్న కార్మికుల వివరాలు అందజేయాలని ఆదేశించారు.అనంతరం ట్రావెలర్స్ బంగ్లాను పరిశీలించి, గదులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గాంధీ పార్క్ మరియు ట్రావెలర్స్ బంగ్లాకు సంబంధించిన ఆదాయ వివరాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈలు హనీఫ్, శ్రీనివాస్, వెంకటరమణ, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ సాంబయ్యతో పాటు ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తిరునాళ్లలో మద్యం మాఫియా...

మొదటి పేజీ తరువాయి

పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.తిరునాళ్ల సమయంలో భక్తుల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహించాల్సి ఉండగా, ఆ విధులను పక్కనపెట్టి మద్యం వ్యాపారంలో తలమునకలైనట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిషేధం ఉన్నప్పటికీ బహిరంగంగా మద్యం విక్రయాలు జరగడం వల్ల భక్తుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఇది చట్టంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సినవారే చట్టాన్ని ఉల్లంఘిస్తే, ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట ఎలా పడుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# అప్పికట్లలో మహాశివరాత్రి వేడుకలు వైభవం

బాపట్ల రక్షణ న్యూస్



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలోని పురాతన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.లోకకళ్యాణం, నియోజకవర్గ ప్రజల క్షేమం కోసం ఎమ్మెల్యే గారు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా పరమశివుని ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనులను పూర్తి చేయాలి

## నగర పాలక సంస్థ కమిషనర్ అశోక్

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. పనుల వేగవంతం కోసం ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈల వారీగా ప్రతి వార్డ్ పరిధిలో కొనసాగుతున్న, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై సమీక్షించారు.అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తయ్యేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. రోడ్ల విస్తరణ, డ్రైన్ల నిర్మాణ సమయంలో పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో సర్వేయర్




ద్వారా మార్కింగ్ చేయాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాల మార్పిడి (షిఫ్టింగ్)కు సంబంధించిన పెండింగ్ అంశాలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఈను ఆదేశించారు.సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్, ఈఈలు సుందర్రామిరెడ్డి, వేణు, విష్ణుతో పాటు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైసిపి కి గుడ్ బై

## తుళ్లూరు మండలంలో ఇద్దరు వైసీపీ నాయకులు పార్టీ పదవుల రాజీనామా ఇప్పుడు కలకలం

**తుళ్లూరు రక్షణ న్యూస్**

తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం గ్రామానికి చెందిన ఐయినవోలు సుధీర్‌కు ఇటీవల తాడికొండ నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడిగా పదవి ఇచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, అలాగే లింగాయపాలెం గ్రామానికి చెందిన కలపాల ప్రభుదాస్‌కు తుళ్లూరు మండల వైసిపి ఉపాధ్యక్ష పదవి కేటాయించింది. అయితే ఈరోజు వారు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్ బాబుకు లేఖ అందజేసినట్లు తెలిసింది. తమ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు వారు లేఖలో పేర్కొన్నప్పటికీ, నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలపై సమాచారం ఇవ్వకపోవడం, సమన్వయం లోపించడం వంటి అంశాలపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇటీవల తుళ్లూరు మండల వైసీపీ నాయకులతో కలిసి డైమండ్ బాబు వైవి సుబ్బారెడ్డిను కలిసిన సందర్భంలో కనీస సమాచారం కూడా ఇవ్వలేదని, అదే కారణంగా అసమ్మతి వ్యక్తం



చేస్తూ రాజీనామా చేసినట్లు సమాచారం.అయితే పార్టీ పదవులకు రాజీనామా చేసినప్పటికీ తాము వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి విధేయులుగానే కొనసాగుతామని నాయకులు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ పరిణామం తాడికొండ నియోజకవర్గ వైసిపి వర్గాల్లో చర్చ తారస్థాయికి చేరుకుంది.

# శాప్ లీగ్ ప్రారంభం

## శాప్ లీగ్ పోస్టును ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారీయా

**గుంటూరు రక్షణ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ) రూపొందించిన 'శాప్ లీగ్' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.గ్రాస్‌రూట్ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం లక్ష్యంగా ఈ లీగ్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి రెండో వారం నుంచి డిసెంబర్ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, తో కలిసి జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించి, ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని చెప్పారు.ఫిబ్రవరి 21న తిరుపతిలో రాష్ట్ర స్థాయి చెస్ లీగ్ ప్రారంభం కానుందని తెలిపారు. ఎంపికైన




క్రీడాకారులకు భవిష్యత్తులో కోనేరు హంపి, పి.వి. సింధుల వంటి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి ప్రత్యేక శిక్షణ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ తల్లి జాతర వైభవం

## పోలేరమ్మ వారోత్సవాల లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన విన్నకోట సురేష్..

**బాపట్ల రక్షణ న్యూస్**



శ్రీ వడ్డీ పోలేరమ్మ ఆలయంలో వారోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి, వేదమంత్రాల నడుమ విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు విన్నకోట హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.పూజల అనంతరం ఆయన చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు ప్రసాదంగా అన్నదానం ఏర్పాటు చేయడంతో పాల్గొన్న వారు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వర్లు పాల్గొని ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అలాగే జనసేన బాపట్ల రూరల్ మండలం అధ్యక్షుడు దాసరి ఏసుబాబు, బాపట్ల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ, పసుపులేటి మహేష్, ఈమని మణిదీప్, విజయరావు నరేష్, కన్నారప ఫణి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నేరస్తుడికి జైలు శిక్ష

## కారంచేడు ఫోక్స్ కేసు ఘటనలో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ,రూ 6,000 జరిమానా

**కారంచేడు రక్షణ న్యూస్**



కారంచేడు పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 6,000 నగదు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 7 సంవత్సరాల మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నల్లగొర్ల శ్రీనివాసరావు పై నమోదైన కేసులో ఈ శిక్ష విధించబడింది.ఒంగోలు స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె. శైలజ సాక్ష్యాధారాలను పరిశీలించి సోమవారం తీర్పు వెల్లడించారు. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన బాలికను మాయమాటలు చెప్పి ప్రలోభపెట్టి అఘాయిత్యానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది.ఈ ఘటనపై అప్పటి కారంచేడు ఎస్ఐ ఆర్. అహ్మద్ జాని కేసు నమోదు చేయగా, చీరాల ట్రైనింగ్ డీఎస్పీ శ్రవంతి రాయ్ దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను సేకరించారు. అనంతరం చీరాల డీఎస్పీ పి. శ్రీకాంత్ చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో స్పెషల్ పీపీ గొట్టిపాటి శ్రీనివాసరావు వాదనలు వినిపించి నేరాన్ని నిరూపించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమర్థవం తమైన దర్యాప్తు, కోర్టు ట్రయల్ మానిటరింగ్ వల్లనే నిందితుడికి శిక్ష పడిందని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతమైన దర్యాప్తు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, ట్రయల్ మానిటరింగ్ నిర్వహించిన పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, పీపీని జిల్లా ఎస్పీ అభినందించారు.

# వికసిత భారత్ ప్రదర్శన

### కోటప్పకొండలో వికసిత భారత్ ప్రదర్శన ముగింపు



నరసరావుపేట రక్షణ న్యూస్

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "వికసిత భారత్ -- పల్నాడు పురోగతి �
వందేమాతరం 150 సంవత్సరాలు" ఇతివృత్తంతో నిర్వహించిన చిత్ర ప్రదర్శన సోమవారం ఘనంగా ముగిసింది.రెండు రోజుల పాటు కొనసాగిన ఈ ప్రదర్శనను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రారంభించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వందేమాతరం గేయ చరిత్రకు సంబంధించిన విశేషాలను చిత్రాల ద్వారా ప్రదర్శించారు.సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రమేష్ చంద్ర సందర్శకులకు వివిధ పథకాలపై వివరాలు అందించారు. విద్యార్థులు, జిల్లా అధికారులు, ప్రజలు ప్రదర్శనను సందర్శించారు. అదనంగా శ్రీ షిర్డీ సాయిబాబా తోలుబొమ్మలాట బృందం రామాయణ ఘట్టాలతో వినోదాన్ని అందించింది.

# బడ్జెట్ ప్రజల భవిష్యత్‌కు బ్లూ ప్రింట్

### ఎమ్మెల్యే నరేంద్ర



బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 2026--27 రాష్ట్ర బడ్జెట్‌పై గౌరవ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ బడ్జెట్ గణాంకాల పుస్తకం కాదని, కోట్లాది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విజన్ డాక్యుమెంట్ అని అన్నారు. వ్యవసాయం, సాగునీటి, విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, బడుగు--బలహీన వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. రూ.3.32 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూలధన వ్యయం, రైతు సహాయం, గృహనిర్మాణం, సంక్షేమానికి రికార్డు కేటాయింపులు జరిగాయని చెప్పారు. విజన్--2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిని ఆయన అభినందించారు.

# ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ




## ఏపీఓఎస్ఎస్ పరీక్షలకు కట్టుదిట్ట ఏర్పాట్లు జాయింట్ కలెక్టర్ భావన

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లాలో నిర్వహించనున్న -- 2026 పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన, ఐఏఎస్ ఆదేశించారు.మార్చి 3 నుంచి 13 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9 కేంద్రాల్లో నిర్వహించనుండగా, మొత్తం 1,930 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అలాగే మార్చి 16 నుంచి 28 వరకు 10వ తరగతి పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 10 కేంద్రాల్లో జరగనున్నాయి. వీటికి 862 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.పరీక్షలు జరిగే రోజుల్లో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, ముందస్తుగా పరీక్ష కేంద్రాలను పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా పోలీస్, విద్యుత్, ఆర్టీసీ తదితర శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు.జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఇంచార్జి డీఆర్వో లవన్న, డీఈఓ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, పోలీస్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



## పీజీఆర్ఎస్‌లో అర్జీల పరిష్కారంపై కలెక్టర్ దృష్టి

## బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల రక్షణ న్యూస్



జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో మొత్తం 150 అర్జీలు స్వీకరించబడినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. అందిన ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పీజీ ఆ ర్ఎస్ హాల్‌లో అర్జీదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, వారి సమస్యలను స్వయంగా విన్న కలెక్టర్, పెండింగ్ కేసులు ఎస్ఎల్ఏ దాటకుండా చూడాలని స్పష్టం చేశారు. అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి వినతిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు అందజేయాలని సూచించారు.అదనంగా ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చిన అర్జీలను ప్రాధాన్య క్రమంలో తీసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ అంశాలు, ప్రజలకు అవసరమైన కొత్త పనులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్నతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.